
సాక్షి
తూర్పుగోదావరి
శుక్రవారం । 22 । మార్చి । 2024



సత్యదేవుని వెండి నాణేల సమర్పణ

అన్నవరం: జీఆర్‌టీ ఓం ప్రకాష్ దంపతులు (రాజమహేంద్రవరం) రూ.లక్ష విలువైన సుమారు కేజీ వెండితో తయారు చేసిన 52 సత్యదేవుని వెండి నాణేలు సమర్పించారు.



8,970 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర (సా॥)	సెహరీ శని (ఉ॥)
రాజమహేంద్రవరం	6.24	4.44
కాకినాడ	6.24	4.44
అమలాపురం	6.24	4.44

తమ్ముళ్ల కుమ్ములాటలు

- టీడీపీలో చల్లారని ఆగ్రహావేశాలు
- స్వపక్షంలో రోజురోజుకూ పెరుగుతున్న ధిక్కార స్వరం
- గోపాలపురంలో మద్దిపాటికి అసమ్మతి సెగ
- అధిష్టానం బుజ్జగించినా వెనక్కు తగ్గని ముళ్లపూడి బాపిరాజు వర్గం
- వారంలోగా మద్దిపాటిని మార్చకపోతే రెబల్‌గా దిగుతామని అల్టిమేటం
- కొవ్వూరులో జవహర్‌కు శ్రేణుల మద్దతు
- పునరాలోచన చేయాలని అధిష్టానానికి వార్నింగ్



సాక్షి, రాజమహేంద్రవరం/దేవరపల్లి: జిల్లాలో తెలుగు తమ్ముళ్ల కుమ్ములాటలు తారస్థాయికి చేరాయి. సీట్ల సర్దుబాటులో భాగంగా టీడీపీ, జనసేన అధినేతల వ్యవహార శైలి, తీసుకుంటున్న నిర్ణయాలు ఆయా పార్టీల శ్రేణులకే మింగుడు పడటం లేదు. జనసేనలో కందుల దుర్గేష్‌ను రాజమహేంద్రవరం రూరల్ నుంచి నిడదవోలుకు పంపించిన విషయం తెలిసిందే. దీనిపై రూరల్‌లో జనసేన శ్రేణులు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. టీడీపీలో కూడా నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు మద్దతుగా ఆ పార్టీ శ్రేణులు ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా గోపాలపురం, కొవ్వూరుల్లో కూడా టికెట్లు ఆశించి భంగపడిన నేతలు అధినేత చంద్రబాబుపై ధిక్కారస్వరం వినిపిస్తున్నారు. సీట్ల ప్రకటన విషయంలో పునరాలోచన చేయాలని వారు అల్టిమేటం జారీ చేస్తున్నారు. అలా చేయకుంటే రెబల్ అభ్యర్థులను రంగంలోకి దింపుతామని, మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని హెచ్చరిస్తున్నారు. తమను కాదని నియోజకవర్గంలో ఎలా గెలుస్తారో చూస్తామంటూ శపథం చేస్తున్నారు. ప్రజల్లో తమకున్న ఆదరణను చూపేందుకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలను సమకూర్చుకుని బలప్రదర్శనలకు దిగుతున్నారు. ప్లకార్డుల ప్రదర్శన, ఆందోళనలకు ఆజ్యం పోస్తున్నారు. పార్టీ పరిష్టత కోసం రూ.కోట్లు ఖర్చు చేసినా తమను కరివేపాకు తరహాలో తీసిపడేయడంపై మండిపడుతున్నారు. ఈ పరిణామం ప్రస్తుతం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని కలవరపాటుకు గురి చేస్తోంది.

మద్దిపాటిపై అసమ్మతి మంటలు

గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా మద్దిపాటి వెంకట్రాజును అధిష్టానం ప్రకటించడంతో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. 'మద్దిపాటి వద్దు.. మరెవ్వరైనా ముద్దు' అంటూ ఆ పార్టీ నేతలే నిరసనకు దిగారు. మద్దిపాటి వెంకట్రాజుకు వ్యతిరేకంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు వర్గం ప్లకార్డులు ప్రదర్శించి మరీ నిరసన తెలిపారు. చంద్రబాబు తీసుకున్న నిర్ణయంపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం, ద్వారకా తిరుమల మండలాలకు చెందిన మద్దిపాటి వెంకట్రాజు అసమ్మతి వర్గం బుధవారం సాయంత్రం నల్లజర్లలో సమావేశమైంది. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. పార్టీ అధినేత చంద్రబాబు వారం రోజుల్లోగా అసమ్మతి వర్గ కీలక నేతలతో చర్చించి మద్దిపాటి అభ్యర్థిత్వాన్ని మార్చకపోతే తమ సత్తా చూపిస్తామని అల్టిమేటం జారీ చేశారు. సరైన నిర్ణయం తీసుకోకుంటే రెబల్ అభ్యర్థిని బరిలో దించుతామని హెచ్చరించారు. అభ్యర్థిని ఖరారు చేసే ముందు తమకు సంప్రదించకుండా నిర్ణయం ఎలా తీసుకుంటారని మండిపడ్డారు. 16 నెలలుగా మద్దిపాటికి వ్యతిరేకంగా పోరాడుతున్నా పట్టించుకోకపోవడంపై కారాలు మిరియాలు నూరుతున్నారు. సొంత డబ్బుతో రెబల్ అభ్యర్థిని గెలిపించుకుని బాబుకు గిఫ్ట్ ఇస్తామని ప్రకటించారు. నియోజకవర్గంలో సుమారు 45 వేల ఓట్లున్న మాల సామాజికవర్గానికే టీడీపీ టికెట్టు ఇవ్వాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు.



మద్దిపాటి వద్దంటూ నల్లజర్లలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అసమ్మతి నేతలు

బుజ్జగింపులకు ససేమిరా..

మద్దిపాటి అభ్యర్థిత్వాన్ని ముళ్లపూడి బాపిరాజు వర్గం ఆది నుంచీ వ్యతిరేకిస్తోంది. మద్దిపాటి నిర్వహిస్తున్న కార్యక్రమాలకు దూరంగా ఉంటోంది. పార్టీ పటిష్టతకు పని చేస్తున్న ముప్పిడి వెంకటేశ్వరరావును ఎందుకు తొలగించాల్సి వచ్చిందో, ఆయనను కొవ్వూరు ఎందుకు పంపించాల్సి వచ్చిందో చెప్పాలని టీడీపీ అధిష్టానాన్ని బాపిరాజు ప్రశ్నించారు. ఆవిర్భావం నుంచీ సొంత డబ్బులు ఖర్చు చేసి పార్టీని బతికించుకుంటూ వస్తున్న సీనియర్ నాయకులకు సంప్రదించకుండా మద్దిపాటికి అందలం వేయడాన్ని బాపిరాజు, ఆయన వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. మద్దిపాటిని తొలగించి ముప్పిడి వెంకటేశ్వరరావుకు **నియోజకవర్గ పగ్గాలు కట్టబెట్టాలని బాపిరాజు అనేక సార్లు చంద్రబాబును అభ్యర్థించారు. అయితే, చంద్రబాబు ఆయన మాటలు పట్టించుకోకుండా మద్దిపాటి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. ఈ పరిణామం బాపిరాజు వర్గంలో అగ్గి రాజేసింది. విషయం గ్రహించిన** అధిష్టానం బాపిరాజును బుజ్జగించినా ససేమిరా అంటున్నారు. దీంతో అధిష్టానం పునరాలోచనలో పడినట్టు తెలిసింది. ఎవరు బుజ్జగించినా తాము వెనక్కు తగ్గేది లేదంటూ ముళ్లపూడి వర్గం స్పష్టీకరిస్తోంది. టీడీపీ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు దేవరపల్లి మండలం గౌరీపట్నం వద్ద ఉన్న నిర్మలగిరి మేరీమాత ఆలయం నుంచి ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి బుధవారం పాదయాత్ర చేపట్టారు. దీనిని బాపిరాజు వర్గం బహిష్కరించింది. గోపాలపురం నియోజకవర్గంలో టీడీపి సీనియర్ కార్యకర్తను రెబల్ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దింపాలని వారు యోచిస్తున్నట్టు తెలిసింది. ఈ పరిణామాలు నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తల్లో గందరగోళాన్ని నింపుతున్నాయి. ఎటువైపు ప్రయాణం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో వారు కొట్టుమిట్టాడుతున్నారు.

కొవ్వూరులో పొత్తుల కత్తులు

ఇటు కొవ్వూరులో కూడా టీడీపీ అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావును ప్రకటించడంపై అసమ్మతి రేగుతోంది. టీడీపీ జిల్లా ఇన్‌చార్జి మాజీ మంత్రి జవహర్‌ను కాదని, గోపాలపురం నుంచి తీసుకుని వచ్చి మరీ ముప్పిడికి కొవ్వూరు టికెట్టు కేటాయించడంపై టీడీపీ శ్రేణులు, జవహర్ సామాజికవర్గ ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. మాజీ మంత్రికి అన్యాయం చేశారంటూ వారు అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. ఈ మేరకు దళిత సంఘాల నాయకులు జవహర్ నివాసానికి వెళ్లి మద్దతు తెలిపారు. అధిష్టానం పునరాలోచన చేయకుంటే ఉద్యమాలకు వెనకాడబోమని స్పష్టం చేశారు. కొవ్వూరు నియోజకవర్గంలో దళితులకు సముచిత స్థానం లేకుండా చేయడాన్ని సహించబోమని చెప్పారు. జవహర్ తీసుకునే ఏ నిర్ణయానికైనా కట్టుబడి ఉంటామని ప్రకటించారు. ఈ పరిణామం ముప్పిడి వెంకటేశ్వరరావు వర్గంలో కలవరం రేపుతోంది. రానున్న ఎన్నికల్లో జవహర్ వర్గం తమకు వ్యతిరేకంగా చేస్తే తమ పరిస్థితేమిటనే మీమాంస ముప్పిడి వర్గంలో నెలకొంది.

చివరికి మిగిలేది ఒక్కటేనా?

- రెండో స్థానంలో జనసేన పోటీపై కానరాని స్పష్టత
- కోనసీమ జిల్లాలో రాజోలు మాత్రమే పోటీకి ఖరారు
- అక్కడ కూడా తేలని అభ్యర్థి
- పి.గన్నవరం ఆశిస్తున్న బీజేపీ
- అదనంగా సీటు ఇచ్చేందుకు అంగీకరించని టీడీపీ
- దీంతో జనసేనకు ఒక్క స్థానమే
- మండిపడుతున్న క్యాడర్

సాక్షి అమలాపురం: 'ఎక్కడ నెగ్గాలో కాదు... ఎక్కడ తగ్గాలో తెలియాలి' పవన్ కళ్యాణ్ సినిమాలో చాలా పాపులర్ అయిన డైలాగ్. ఇప్పుడు సోషల్ మీడియాలో ఈ డైలాగ్ కొంచెం మార్పు చేసి సొంత పార్టీ వాళ్లే ట్రెండ్ చేస్తున్నారు. 'ఎక్కడ తగ్గాలో తెలియడం కాదు.. ఎంత వరకు తగ్గాలో కూడా తెలియాలి' అని వ్యంగ్యంగా పోస్టు చేస్తున్నారు. టీడీపీతో పొత్తులో భాగంగా కేవలం 24 అసెంబ్లీ సీట్లకు ఒప్పుకోవడం.. తరువాత వాటిని 21కి తగ్గించుకోవడం ఆ పార్టీ క్యాడర్ జీర్ణించుకోలేకపోతోంది. ఆ తగ్గించుకున్న సీట్లు కూడా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కావడం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మింగుడుపడని అంశంగా మారింది.

29 శాతం ఓట్లు వచ్చినా..

గత ఎన్నికల్లో జనసేన పార్టీకి చెప్పుకోదగిన ఓటింగ్ వచ్చింది కోనసీమ జిల్లా పరిధిలోనే. రాష్ట్రంలో ఆ పార్టీ గెలిచిన ఒక్క సీటూ ఈ జిల్లా పరిధిలోని రాజోలు కాగా, అన్ని నియోజకవర్గాలలోనూ కలిపి ఇక్కడ సుమారు 29 శాతం ఓట్లు వచ్చాయని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. రాజోలులో 50,053 ఓట్లు రాగా, ఆ తరువాత అమలాపురంలో 45,200, పి.గన్నవరంలో 36,259, ముమ్మిడివరం 33,334, మండపేట 35,173 చొప్పున ఓట్లు వచ్చాయి. అటువంటి జిల్లాలో జనసేన కనీసం మూడుస్థానాలైనా కోరుతుందని పార్టీ వర్గాలు భావించాయి. గతంలో గెలిచిన రాజోలు నుంచి తిరిగి పోటీ చేయడంతోపాటు, జిల్లా కేంద్రమైన అమలాపురం, బీసీలకు ఇచ్చేందుకు ముమ్మిడివరం, రామచంద్రపురంలో ఒక నియోజకవర్గాన్ని కోరుతుందని క్యాడర్ బలంగా నమ్మింది. కాని ఎప్పుడైతే పవన్‌కళ్యాణ్ తొలుత 24 సీట్లకు అంగీకరించారో అప్పుడే ఈ జిల్లాలో కేవలం రెండుస్థానాలు మాత్రమే వస్తాయనే అంచనాకు పార్టీ వచ్చింది. తీరా ఇప్పుడు పరిస్థితి చూస్తే కేవలం ఒక్క సీటుకే పరిమితమయ్యేటట్టు ఉంది.

అమలాపురం కూడా టీడీపీ ఖాతాలోకి..

టీడీపీ తొలి విడతలోనే కొత్తపేట, మండపేట, ముమ్మిడివరం అభ్యర్థులుగా బండారు సత్యానందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, దాట్ల సుబ్బరాజును అభ్యర్థులుగా ప్రకటించింది. ఈ మూడు జనరల్ స్థానాలు కాగా, ఎస్సీలకు రిజర్వ్ అయిన పి.గన్నవరంలో సరిపెళ్ల రాజేష్‌కుమార్ (మహాసేన రాజేష్)ను ఎంపిక చేశారు. రాజేష్ అభ్యర్థిత్వంపై జిల్లా వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తడంతో ఈ సీటు సందిగ్ధంలో పడింది. రెండవ దశలో రామచంద్రపురం సైతం టీడీపీ తీసుకుని ఇక్కడ నుంచి కొత్తగా పార్టీలో చేరిన వాసంశెట్టి సుభాష్‌ను ఎంపిక చేసింది. దీంతో టీడీపీ ఏకంగా ఐదు స్థానాలు ప్రకటించినట్టయ్యింది. ఇక జనసేనకు మిగిలింది రాజోలు, అమలాపురం ఎస్సీ నియోజకవర్గాలు. దీనిలో రాజోలు నుంచి పోటీ చేస్తామని జనసేన అధినేత పవన్ ప్రకటించిన విషయం తెలిసిందే. అమలాపురం మాత్రం ఎటూ తేలడం లేదు. ఇక్కడ నుంచి జనసేన పోటీ చేస్తోందనే ప్రచారం జరిగినా చివరకు దీనిని కూడా టీడీపీ లాగేసుకున్నట్టు తెలిసింది. అమలాపురం ఎంపీ సీటు ఆశిస్తున్న టీడీపీ నేత గంటి హరీష్‌ను ఇక్కడ నుంచి పోటీలో ఉంచుతారని టీడీపీ అధిష్టానం నుంచి సంకేతాలు అందుతున్నాయి. పి.గన్నవరం పొత్తులలో భాగంగా బీజేపీ కోరుకుంటోంది. దీంతో జనసేనకు మిగిలింది రాజోలు నియోజకవర్గం ఒక్కటే.

క్యాడర్‌లో నిరుత్సాహం

రాజోలు నుంచి జనసేన పోటీ చేస్తోందని పవన్ ప్రకటించి నెల రోజులు దాటింది. ఇంకా అభ్యర్థిని మాత్రం ప్రకటించలేదు. మాజీ ప్రభుత్వ ఉద్యోగులు దేవీ వరప్రసాద్, బొంతు రాజేశ్వరరావు ఇక్కడ నుంచి సీటు ఆశిస్తున్నారు. ఇప్పటికీ ఇక్కడ అభ్యర్థిని తేల్చకపోవడం పార్టీ క్యాడర్‌ను నిరుత్సాహానికి గురి చేస్తోంది. వైఎస్సార్ సీపీ రాజోలు నుంచి మంత్రి గొల్లపల్లి సూర్యారావును బరిలో నిలిపింది. ఇదే నియోజకవర్గానికి చెందిన ప్రస్తుత ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావును అమలాపురం లోక్‌సభ స్థానానికి అభ్యర్థిగా ఎంపిక చేసింది. దీంతో ఈ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఫుల్ జోష్ మీద ఉంది. అటువంటి చోట కూడా అభ్యర్థిని ఎంపిక చేయకుండా పవన్ ఆలస్యం చేయడంతో క్యాడర్ నీరుగారిపోతోంది. 'పొత్తులలో సీట్లు త్యాగం చేయడం కేవలం జనసేన మాత్రమేనా. టీడీపీ చేయదా? లేక అడిగే సత్తా మా నాయకునికి లేదో? తెలియడం లేదు' అని జనసేన కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజోలుతోపాటు అమలాపురం స్థానాన్ని పొత్తులలో తీసుకోవాలని జనసేన క్యాడర్ కోరుతోంది. సోషల్ మీడియా వేదికగా తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తోంది.

వైఎస్సార్‌సీపీ కమిటీల్లో పలువురికి చోటు

- యువజన, మైనార్టీ విభాగాల నియామకం
- ఇతర కమిటీల్లోనూ పదవులు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీలోని వివిధ జిల్లా కమిటీల్లో పలువురిని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది. పార్టీ వివిధ విభాగాల వారీగా నియమితులైన వారు వీరే..

యువజన విభాగం

జిల్లా అధ్యక్షుడిగా చవుటుపల్లి వీరన్న (కొవ్వూరు); ఉపాధ్యక్షులుగా శ్రీహరివర్మ (రాజానగరం), పి.లక్ష్మణరావు (కొవ్వూరు); ప్రధాన కార్యదర్శులుగా గంటా చిరంజీవి (కొవ్వూరు), మన్నే యువరాజు (గోపాలపురం), పోతుల కనకరాజు (గోపాలపురం), పలివెల నాగేశ్వరరావు (రాజమహేంద్రవరం రూరల్), బండి నారాయుడు (రాజానగరం), వల్లభశెట్టి రామసీతయ్య (అనపర్తి), మల్లాది ఉదయరాణా(రాజమహేంద్రవరం సిటీ); కార్యదర్శులుగా సురేష్ (కొవ్వూరు), పల్లి రామకృష్ణ (కొవ్వూరు), ఈతకోట సందీప్ కుమార్, వదిరి రామకృష్ణ (రాజమహేంద్రవరం రూరల్).

మైనార్టీ విభాగం

జిల్లా అధ్యక్షుడిగా ఎస్.వజీరుద్దీన్ (నిడదవోలు); ఉపాధ్యక్షునిగా ఎండీ రమీజ్ అహ్మద్ (రాజమహేంద్రవరం సిటీ); ప్రధాన కార్యదర్శులుగా ఎస్‌కే ఖాన్ (రాజమహేంద్రవరం సిటీ), షేక్ అక్రమ్ బాషా (అనపర్తి), ఎస్‌కే మస్తాన్ (రాజమహేంద్రవరం సిటీ), ఎస్‌కే మీరా షరీఫ్ (నిడదవోలు), షేక్ మౌలాలి (రాజమహేంద్రవరం రూరల్), ఎండీ అహ్మద్ షరీఫ్ (కొవ్వూరు), షేక్ మస్తాన్ వలీ (రాజానగరం); కార్యదర్శులుగా ఎండీ ఇనాముల్లా (రాజానగరం), షేక్ ముంతియాజ్ (అనపర్తి), మస్తాన్ (రాజమహేంద్రవరం రూరల్).

ఇతర విభాగాల్లో..

- జిల్లా బీసీ విభాగం సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ అచ్చుల చంద్రశేఖరబాబు (రాజమహేంద్రవరం రూరల్).
- జిల్లా కల్చరల్ విభాగానికి అనపర్తి నియోజకవర్గానికి చెందిన పడాల శ్రీనివాసరావు (ప్రధాన కార్యదర్శి), అడబాల కొండయ్య, చీదం వీర వెంకట సత్యనారాయణ (కార్యదర్శులు), ఉల్లి సురేష్, గొల్ల వినోద్ (జాయింట్ సెక్రటరీ).
- జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శులుగా దేవులపల్లి సరితారాణి (రాజమహేంద్రవరం రూరల్), బుద్దాల వెంకటలక్ష్మి (అనపర్తి); కార్యదర్శులుగా టి.రుక్మిణి, ఓరా జయమ్మ (అనపర్తి), యెలుగొండ లక్ష్మి, వెలగల కళ్యాణిరెడ్డి (రాజమహేంద్రవరం రూరల్); జాయింట్ సెక్రటరీలుగా గంధం సుజాత, నల్లమిల్లి ధనలక్ష్మి (అనపర్తి), బోడపాటి భాగ్యలక్ష్మి, రుంకాని రమణమ్మ (రాజమహేంద్రవరం రూరల్).
- జిల్లా పంచాయతీరాజ్ కమిటీలో అనపర్తికి చెందిన పలువురిని నియమించారు. ప్రధాన కార్యదర్శిగా సత్తి సూరారెడ్డి, కార్యదర్శులుగా కూసుమంచి భూలక్ష్మి, పాట్టి కృష్ణ, నల్లా దుర్గాప్రసాద్, మల్లిడి గంగరాజు.



- జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శులుగా ఆచంట సుబ్బారాయుడు (రాజమహేంద్రవరం రూరల్), కొత్త రమణ (అనపర్తి), కార్యదర్శులుగా కురుకూరి శ్రీను, కురుమెళ్ల నారాయణరావు, తల్లా నిరంజన్‌రెడ్డి (అనపర్తి), ఆకుల వెంకన్న, కురుమళ్ల ఆంజనేయులు (రాజమహేంద్రవరం రూరల్); జాయింట్ సెక్రటరీలుగా నల్లమిల్లి నారాయణరెడ్డి, దాట్ల వీవీ గోపాలరాజు, నలమాటి భీముడు (అనపర్తి), దండుమేను దుర్గయ్య, తెల్లమేకల సత్యనారాయణ (రాజమహేంద్రవరం రూరల్).
- జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శులుగా రేగుళ్ల రాజు (రాజమహేంద్రవరం రూరల్), గొల్లపల్లి వెంకటేశ్వరరావు (అనపర్తి); కార్యదర్శులుగా రామవరపు రాజు, సరిగోలు ప్రకాశరావు (అనపర్తి), గోడి అనిల్, మద్దెల వెంకట రమణ (రాజమహేంద్రవరం రూరల్); జాయింట్ సెక్రటరీలుగా చెల్లా శ్రీను, కుందేటి శ్రీను (అనపర్తి), కప్పాల రాజు, కొడమంచలి కోటిబాబు (రాజమహేంద్రవరం రూరల్).
- జిల్లా వాణిజ్య విభాగంలో అనపర్తి నియోజకవర్గానికి చెందిన పడాల దుర్గారెడ్డి (ప్రధాన కార్యదర్శి), విస్సాకోటి సుబ్బారావు, చీవా శ్రీను (కార్యదర్శులు), మండా వెంకటరెడ్డి (జాయింట్ సెక్రటరీ).
- జిల్లా చేనేత విభాగంలో అనపర్తి నియోజకవర్గానికి చెందిన కులపాలకు నందీశ్వరుడు (ప్రధాన కార్యదర్శి), దొంతశెట్టి వీర నాగేశ్వరరావు, బొడ్డు సుబ్రమణ్యం (కార్యదర్శులు), ధరణికోట ఏసు, పంట బ్రహ్మాజీ (జాయింట్ సెక్రటరీలు).
- వైఎస్సార్ సేవాదళ్ కమిటీలో అనపర్తి నియోజకవర్గానికి చెందిన సబ్బెళ్ల సత్తిరెడ్డి (ప్రధాన కార్యదర్శి), నల్లమిల్లి వెంకటరెడ్డి, గుత్తుల హరిబాబు (కార్యదర్శులు), మేడపాటి వెంకటరెడ్డి, తిరుపతి శ్రీనివాస్ (జాయింట్ సెక్రటరీలు).
- వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా పడాల వెంకటరెడ్డి (అనపర్తి).

న్యూస్‌రీల్

మూడో పంటగా బంతి సాగు



బంతి సాగును పరిశీలిస్తున్న నరసింహరావు, శ్రీనివాస్

రాజానగరం: రాజానగరం, కడియం మండలాల్లో మూడో పంటగా బంతి పూల సాగు చేపట్టవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం డైరెక్టర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు గురువారం తెలిపారు. మార్టేరు వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్రీనివాస్‌తో కలిసి ఈ మండలాల్లో ఆయన పర్యటించారు. రబీ వరి అనంతరం నవంబర్‌లో పూల సాగు చేపట్టిన రైతులను కలుసుకుని, బంతి సాగుపై మెళకువలు తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాలలో మినుము, మొక్కజొన్నతో పాటు బంతిపూల సాగు జరుగుతోందని పేర్కొన్నారు. ఆశించిన దానికంటే లాభాలు బాగున్నాయంటూ రైతులు చెప్పారని తెలిపారు. బంతి నారును ఒకేసారి కాకుండా 15 రోజుల వ్యవధిలో పలుమార్లు నాటితే తక్కువ సమయంలోనే దిగుబడులు ప్రారంభమై, నిత్యం పూలు కోతకు వస్తాయని, నాలుగు నెలల పాటు మంచి ఆదాయం పొందుతారని నరసింహారావు చెప్పారు.

త్వరగా ఇంటర్ మూల్యాంకనం

అమలాపురం టౌన్: అసిస్టెంట్ ఎగ్జామినర్లు వెంటనే విధులకు హాజరై మూల్యాంకన ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఇంటర్ క్యాంపు, డీఐఈవో వనుము సోమశేఖరరావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షా పత్రాల మూల్యాంకన ప్రక్రియ మొదలైంది. అయితే బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ నియమించిన కొంతమంది అసిస్టెంట్ ఎగ్జామినర్‌లు ఇంకా హాజరుకాకపోవడం వల్ల మూల్యాంకన ప్రక్రియ జాప్యం జరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ కూడా అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా నియమితులైన అధ్యాపకులను రిలీవ్ చేసి విధులకు పంపించాలని సోమశేఖరరావు గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ నెల 22వ తేదీ నుంచి ఎకనామిక్స్, ఫిజిక్స్ పరీక్షా పత్రాల మూల్యాంకనం మొదలు కానుందని తెలిపారు. ఇప్పటికే మొదలైన గణితం, తెలుగు, ఇంగ్లిషు, పౌర శాస్త్రం పరీక్షా పత్రాల మూల్యాంకనానికి నియమితులైన కొంత మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు ఇంకా విధులకు హాజరు కాలేదని పేర్కొన్నారు.

పంచాయతీకి రూ.2 లక్షల ఫర్నిచర్ బహూకరణ



పోతవరం పంచాయతీకి బహూకరించిన ఫర్నిచర్

పి.గన్నవరం: పోతవరం గ్రామ పంచాయతీ కార్యాలయానికి మెట్రోకెమ్ ఏపీఐ (హైదరాబాద్) ప్రైవేటు లిమిటెడ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ) గురువారం రూ.2 లక్షల విలువైన ఫర్నిచర్‌ను బహూకరించారు. గ్రామానికి చెందిన మెట్రోకెమ్ అధినేతను సర్పంచ్ వదలి కొండయ్య ఇటీవల కలిసి పంచాయతీకి ఫర్నిచర్ కావాలని అడిగారు. దీంతో స్పందించిన ఆయన రూ.2 లక్షలతో ఫర్నిచర్‌ను కొనుగోలు చేసి పంచాయతీకి అందజేశారు. పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో రూ.3 లక్షల వ్యయంతో షెడ్డు నిర్మిస్తామని బాలాజీ ప్రకటించారు. బాలాజీని సర్పంచ్ కొండయ్యతో పాటు గ్రామస్తులు అభినందించారు.

ద్రాక్షారామ భీమేశ్వరాలయ హుండీల ఆదాయం రూ.10.44 లక్షలు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.10,44,556 వచ్చినట్లు ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు తెలిపారు. ఫిబ్రవరి 15 నుంచి ఈ నెల 21వ తేదీ వరకు ఆలయంలోని హుండీలు దేవదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ ఆర్.బాలాజీ రామ్‌ప్రసాద్‌ల సమక్షంలో గురువారం లెక్కించారు. హుండీ ఆదాయ లెక్కింపులో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దామిశెట్టి గంగాపురుషోత్తం, దేవాలయ అర్చకులు, సిబ్బంది, తాపేశ్వరం నుంచి వచ్చిన సేవకులు పాల్గొన్నారు.

సామాన్యులకూ ఎన్నికల కోడ్



రాజమహేంద్రవరం రూరల్: సాధారణంగా ఎన్నికల కోడ్ అంటే రాజకీయ నాయకులకే కదా మనకేం ఇబ్బంది అని చాలామంది అనుకుంటారు. కానీ కొన్నిసార్లు సామాన్యులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. తప్పు చేయకపోయినా అధికారులకు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది. అందువలన ఎన్నికల కోడ్ పట్ల ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ సిబ్బందే కాకుండా సామాన్యులు కూడా కాస్త జాగ్రత్తగా ఉండాల్సిందే. ఎన్నికల ప్రవర్తనా నియామవళిని ఎలక్షన్ కమిషన్ పక్కాగా అమలు చేస్తోంది. ప్రతి ఒక్కరూ ఈ నియమాలను తప్పకుండా పాటించాలి. లేదంటే కోరి చిక్కులు తెచ్చుకున్నట్టేనని అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఎన్నికల కోడ్ అమలవుతున్న సమయంలో నగదు రవాణాపై ఆంక్షలు ఎక్కువగా ఉంటాయి. ఎవరైనా నగదు తరలిస్తున్నప్పుడు సరైన పత్రాలు లేకపోతే చెక్ పోస్టుల వద్ద తనిఖీలు చేసిన సమయంలో అధికారులు ఆ సొమ్మును స్వాధీనం చేసుకుంటారు.

రూ.50 వేలు మించితే వివరణ ఇవ్వాలి

రూ.50 వేలకు మించి నగదును తరలిస్తే పూర్తిగా వివరణ ఇవ్వాలి. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది, ఎలా వచ్చింది, ఎక్కడకు తీసుకుని వెళ్తున్నారు తదితర విషయాలు చెప్పాలి. చెప్పే సమాధానంలో తేడా ఉన్నా, అవాస్తవమని భావించినా అధికారులు ఆ నగదును స్వాధీనం చేసుకుంటారు. సరైన ధ్రువపత్రాలు చూపించాకే తిరిగి అప్పగిస్తారు. అప్పటి వరకూ ఆ నగదు కోర్టు కస్టడీలో ఉంటుంది. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేంత వరకూ ఈ నిబంధనలు అమలులో ఉంటాయి. నగదు మాత్రమే కాకుండా బంగారం, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులు ఏవైనా సరే అనుమానం వస్తే అధికారులు స్వాధీనం చేసుకుంటారు. బంగారం, వెండి తదితర వర్తకులు సైతం తగిన పత్రాలు వెంట ఉంచుకునే ప్రయాణాలు సాగించాలి. అలాగే, తగిన అనుమతులు లేకపోతే మద్యం, ఆయుధాలు, ఇతర విలువైన సామగ్రిని కూడా స్వాధీనం చేసుకుంటారు.

ప్రకటనలకు ముందస్తు అనుమతి

- 48 గంటల ముందుగా తీసుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రచార ప్రకటనలకు సంబంధించి అనుమతి పొందేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు కనీసం 48 గంటల ముందుగా అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) తొలి సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల నియమావళిని అనుసరించి వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు వివిధ మాధ్యమాల్లో ప్రచారం చేస్తారని చెప్పారు. ఆయా ప్రకటనలు, ప్రచార అంశాలు, చెల్లింపు వార్తలు, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ఉల్లంఘన, ఖర్చుల వివరాలపై నివేదికలను ఆయా బృందాలకు అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రకటనలకు సంబంధించి నిర్ణీత ఫారం–ఎ ద్వారా రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకుని, సంబంధిత పత్రాలు అందజేయాలని సూచించారు. దీనిని ఎంసీఎంసీ ఆధ్వర్యాన పరిశీలించి, అభ్యర్థుల పేరిట ధ్రువపత్రం జారీ చేస్తారన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం చేసే ప్రకటనలకు కూడా ముందస్తు అనుమతులు తప్పనిసరని స్పష్టం చేశారు. ఆయా పత్రికలు, చానళ్లు, రేడియో, ఎఫ్ఎం చానల్స్, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రకటనలు నిశితంగా పరిశీలించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆయా పత్రికలు, చానల్ ప్రామాణిక రేట్ కార్డుల ప్రకారం ప్రకటనల ఖర్చులను అభ్యర్థుల ఖాతాలకు కలుపుతామని చెప్పారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలోనే అభ్యర్థులు సోషల్ మీడియా వివరాలు, దీనిని ప్రమోట్ చేసే ఏజెన్సీ వివరాలు తెలియజేయాల్సి ఉంటుందని కలెక్టర్ మాధవీలత తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, రాజమహేంద్రవరం లోక్‌సభ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి ఆర్.కృష్ణనాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈశా స్పా సెంటర్‌లో వ్యభిచారం

కాకినాడ క్రైం: కాకినాడ భానుగుడి కూడలి కోటగిరి సీటీ సెంటర్ కాంప్లెక్స్‌లో ఉన్న ఈశా స్పా సెంటర్‌లో యాజమాన్యం వ్యభిచారం నిర్వహిస్తోందని పోలీసుల తనిఖీలలో తేలింది. బుధవారం రాత్రి వ్యభిచారం నిర్వహిస్తుండగా ఇద్దరు విటులు, ఒక మహిళను పట్టుకున్నట్లు టూ టౌన్ సీఐ నాగేశ్వర్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి మహిళలను బ్యూటీ పార్లర్ సేవల పేరుతో తీసుకువచ్చి వారి సమ్మతితో యాజమాన్యం ఈ నిర్వాకానికి పాల్పడుతోందన్నారు. విటులు, మహిళతో పాటు ఇద్దరు యజమానులు మొత్తం ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

సమాజ సమస్యలపై కవులు స్పందించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న సత్యనారాయణ

సీటీఆర్ఐ: ప్రణమిల్లే కలాలు కాదు, పదునెక్కిన కలాలు రావాలి, నేటి సమాజ సమస్యలపై స్పందించి కవులు తమ కలాలకు పదును పెట్టాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ తెలుగుశాఖ ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ కవిత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ, కళాగౌతమి సంయుక్త నిర్వహణలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబిల్ రాజబాబు మాట్లాడుతూ ఎంతో మంది కవులు తమ కవిత్వాలతో ప్రజలను రంజిపచేసి స్ఫూర్తిదాతలుగా నిలిచారన్నారు. సభకు అధ్యక్షత వహించిన తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ అందాన్ని మరింత అందంగా వర్ణించాలన్నా, హాస్యాన్ని వ్యంగ్యంతో జోడించాలన్నా, పాలకులను పొగడాలన్నా, ప్రజల్లో చైతన్యం రగిలించాలన్నా కవిత్వానికి మించిన సాధనం లేదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.రాజ్ కుమార్, పల్లి సుధ, ఎం.లలితా రమ్య, ఎ.సరళ, ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరి పాల్గొన్నారు.

నిరసనకు ప్రతీక నోటా

- అభ్యర్థి నచ్చకపోతే దీనికే ఓటు
- 2019లో ప్రధాన పార్టీల తర్వాత స్థానం దీనిదే



రాయవరం: దేశంలో నివసించే 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు పొందే అవకాశాన్ని రాజ్యాంగంలోని ఆర్టికల్–326 కల్పిస్తోంది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నచ్చకపోతే తిరస్కరణ ఓటు వేసే హక్కు కల్పిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటర్లకు అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)లో బరిలో ఉన్న అభ్యర్థుల గుర్తుతో పాటు నోటా ఆప్షన్‌ను ఏర్పాటు చేసింది. ఆ బటన్ నొక్కితే ఓటు ఏ పార్టీకి పడదు. కానీ ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకున్నట్లుగానే ఎన్నికల కమిషన్ పరిగణిస్తుంది.

2019 ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరిలోని 21 నియోజకవర్గాలలో 40,308 ఓట్లు నోటాకు పోలయ్యాయి. వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఉన్న ఆ ఎన్నికల్లో చాలాచోట్ల జాతీయ పార్టీల ఓట్లు కంటే నోటాకే అధికంగా వచ్చాయి.

నియోజకవర్గాల వారీగా నోటాకు పోలైన ఓట్లు..

- తునిలో నోటాకు 2,584 జనరల్ ఓట్లు, పోస్టల్ బ్యాలట్‌లో రెండు మొత్తం 2,586 ఓట్లు పోలయ్యాయి. ఇది మొత్తం ఓట్లలో 1.45 శాతం. 16 మంది పోటీలో ఉండగా, 11 మందికి నోటా కంటే తక్కువగా ఓట్లు పోలయ్యాయి.
- ప్రత్తిపాడులో 10 మంది పోటీలో చేశారు. 1.26 శాతం ఓట్లు నోటాకు పోలయ్యాయి. 2,077 జనరల్ ఓట్లు, పోస్టల్ బ్యాలట్ ఓట్లు రెండు కలిపి 2,079 ఓట్లు నోటాకు పోలయ్యాయి. ఐదుగురికి నోటా కంటే తక్కువ ఓట్లు పోలయ్యాయి.
- పిఠాపురంలో నోటాకు జనరల్ 2,334, ఐదు పోస్టల్ బ్యాలట్ ఓట్లు పడ్డాయి. 1.25 శాతం ఓట్లు నోటాకు పోలయ్యాయి. 1 మంది పోటీలో ఉండగా, ఏడుగురు నోటా కన్నా తక్కువ ఓట్లు తెచ్చుకున్నారు.
- కాకినాడ రూరల్‌లో 16 మంది పోటీలో ఉన్నారు. 0.85 శాతం ఓట్లు నోటాకు పోలయ్యాయి. 1,567 జనరల్, పోస్టల్ బ్యాలట్ ఓట్లు ఎనిమిది మొత్తం 1,575 నోటాకు వచ్చాయి. 11 మంది నోటా కంటే తక్కువ ఓట్లు తెచ్చుకున్నారు.
- పెద్దాపురంలో 11 మంది పోటీలో నిలిచారు. నోటాకు 1.27శాతం ఓట్లు పోలయ్యాయి. 2,067 జనరల్, ఐదు పోస్టల్ బ్యాలట్ ఓట్లు మొత్తం 2,072 ఓట్లు నోటాకు వచ్చాయి. ఏడుగురికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి.
- అనపర్తిలో 12 మంది పోటీలో ఉండగా, నోటాకు 1.13 శాతం ఓట్లు వచ్చాయి. ఎనిమిది మందికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. 2,114 జనరల్ ఓట్లు నోటాకు పోలయ్యాయి.
- కాకినాడ సిటీలో 16 మంది పోటీ చేశారు. ఇక్కడ నాలుగు ప్రధాన పార్టీల తర్వాత స్థానం నోటాదే. జనరల్ ఓట్లు 1,646, పోస్టల్ బ్యాలట్ ద్వారా ఎనిమిది మొత్తం 1,654 ఓట్లు నోటాకు పోలయ్యాయి. 0.92శాతం ఓట్లు నోటాకు వచ్చాయి. 11 మందికి నోటా కంటే తక్కువగా ఓట్లు వచ్చాయి.
- రామచంద్రపురంలో 14 మంది పోటీలో నిలువగా 1,458 జనరల్ ఓట్లు, ఐదు పోస్టల్ బ్యాలట్ ఓట్లు కలిపి మొత్తం 1,463 నోటాకు వచ్చాయి. 10 మందికి నోటా కంటే తక్కువ ఓట్లు పోలయ్యాయి.
- ముమ్మిడివరంలో 12 మంది పోటీలో నిలువగా నోటాకు 1.19 శాతం ఓట్లు పోలయ్యాయి. 2,298 జనరల్ ఓట్లు నోటాకు పోలయ్యాయి. ఎనిమిది మందికి నోటా కంటే తక్కువగా ఓట్లు వచ్చాయి.
- అమలాపురంలో 10 మంది పోటీలో ఉండగా 1.18శాతం ఓట్లు నోటాకు పోలయ్యాయి. మొత్తం 2,006 ఓట్లు నోటాకు వచ్చాయి. ఆరుగురికి నోటా కంటే తక్కువగా ఓట్లు వచ్చాయి
- రాజోలులో 11 మంది పోటీ చేయగా 0.94 శాతం ఓట్లు నోటాకు పోలయ్యాయి. ఏడుగురు అభ్యర్థులకు నోటా కంటే తక్కువ వచ్చాయి.
- గన్నవరం నియోజకవర్గంలో 11 మంది పోటీలో నిలువగా, నాల్గవ స్థానం నోటాదే. 2,470 ఓట్లు నోటాకు వచ్చాయి. ఏడుగురిగి నోటా కంటే తక్కువ ఓట్లు పోలయ్యాయి.
- కొత్తపేటలో 12 మంది పోటీ చేశారు. నోటాకు 0.97 శాతం అంటే 1,996 ఓట్లు పోలయ్యాయి. ఎనిమిది మందికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి.
- మండపేటలో 12 మంది పోటీలో నిలవగా, నోటాకు 0.84 శాతం అంటే 1,584 ఓట్లు పోలయ్యాయి.
- రాజానగరంలో 13 మంది పోటీ చేయగా, 2,200 ఓట్లు నోటాకు పోలయ్యాయి. 1.24 శాతం ఓట్లు నోటాకు పోలయ్యాయి. ఎనిమిది మందికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి
- రాజమహేంద్రవరం సిటీలో 12 మంది పోటీలో నిలిస్తే నోటాకు 0.81శాతం ఓట్లు పోలయ్యాయి. 1,369 ఓట్లు నోటాకు వచ్చాయి. ఆరుగురికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి.
- రాజమహేంద్రవరం రూరల్‌లో 15 మంది అభ్యర్థులు పోటీ చేస్తే నోటాకు 1,621(0.85శాతం) ఓట్లు పోలయ్యాయి. 10 మందికి నోటా కంటే తక్కువ వచ్చాయి.
- జగ్గంపేటలో 12 మంది పోటీలో నిలవగా, 3,016 (1.66శాతం) ఓట్లు నోటాకు పోలయ్యాయి. ఎనిమిది మంది నోటా కంటే తక్కువ ఓట్లు తెచ్చుకున్నారు.
- రంపచోడవరంలో 16 మంది బరిలో నిలవగా, 4,453(2.20శాతం) ఓట్లు నోటాకు వచ్చాయి. 11 మందికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి.

కూల్‌డ్రింక్స్ గోదాంలో అగ్ని ప్రమాదం

రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని అంచనా



గోదాంలో కాలిబూడిదైన సామగ్రి

కరప: స్థానిక శ్రీలక్ష్మి ఏజెన్సీస్ కూల్‌డ్రింక్స్ గోదాంలో గురువారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. గోదాం సూపర్‌వైజర్ కొర్ల చక్రయ్య తెలిపిన వివరాల మేరకు బుధవారం రాత్రి గోదాంకు తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. గురువారం ఉదయం పొగలు వస్తుండటంతో చూసేసరికి మంటలు చెలరేగి, సామగ్రి కాలి, బూడిదయింది. స్థానికులతో కల్సి మంటలు వ్యాప్తి చెందకుండా చేశారు. కాకినాడ జగన్నాథపురం నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను అదుపు చేసింది. బుధవారం సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరా లేదని, రాత్రి సమయంలో కరెంట్ వచ్చి, పోవడంతో విద్యుదాఘాతం సంభవించి, ఉంటుందని భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో రూ.85 వేల నగదు, కంప్యూటర్ ల్యాప్‌ట్యాప్, క్యాష్ లెక్కించే మెషీన్, సీసీ కెమెరాల ఎక్విప్‌మెంట్, ప్రింటర్, ఫైల్స్, కూల్‌డ్రింక్స్ కేసులు అగ్నికి ఆహుతయ్యాయి. అదే గోదాంలో వ్యాన్‌లు, కొంత స్టాక్ ఉంది. వాటికి మంటలు వ్యాపించి ఉంటే భారీ నష్టం జరిగేదని నిర్వాహకులు తెలిపారు. వీఆర్వో ప్రభుదాస్ ఘటనా స్థలానికి వచ్చి జరిగిన అగ్ని ప్రమాదం, నష్టంపై ఆరా తీశారు. తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావుకు అగ్ని ప్రమాద వివరాలను నివేదించినట్టు వీఆర్వో తెలిపారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి ఘటనా స్థలానికెళ్లి పరిశీలించి, ప్రమాద వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ముగ్గురు బాల నేరస్తుల అరెస్ట్

20 ద్విచక్ర వాహనాల స్వాధీనం



రికవరీ చేసిన మోటారు సైకిళ్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ అనిల్‌కుమార్, డీఎస్పీ విజయ్‌పాల్, సీఐ వీరయ్యగౌడ్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నగర పరిధిలో ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ముగ్గురు బాలలను మూడో పట్టణ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. గురువారం మూడో పట్టణ పోలీసు స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఎస్పీ అనిల్‌కుమార్ వివరాలు తెలిపారు.

నేర పరిశోధనా కృషే దొంగలను పట్టించింది

నగర పరిధిలో ఇటీవల కాలంలో ద్విచక్ర వాహనాల చోరీ ఎక్కువ అవుతుండటంతో ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు క్రైం డీఎస్పీ కె.విజయపాల్ పర్యవేక్షణలో నిఘా పెంచారు. రాత్రి సమయాల్లో ఈ చోరీలు జరుగుతుండటంతో గస్తీ ముమ్మరం చేశారు. మూడో పట్టణ పరిధిలో ఇన్‌స్పెక్టర్ వీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఎస్సై యూవీఎస్ శివనాగబాబు క్రైం సిబ్బందిని అప్రమత్తం చేశారు. స్టేషన్ పరిధిలోని పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచారు. దీంతోపాటు ఎటువంటి నేర రికార్డులు లేని ఆకతాయి యువకులపై దృష్టి సారించారు. స్టేషన్ పరిధిలో స్థానికంగా అల్లర చిల్లరగా తిరిగే యువకుల వివరాలు సేకరించి వారి అలవాట్లు, ప్రవర్తనలోని మార్పులపై స్థానిక యువకుల ద్వారా సమాచారం సేకరించారు. ఈ నేపథ్యంలో అనుమానాస్పదంగా ముగ్గురు బాలురు కనిపించారు. వారి కుటుంబానికి ఆర్థిక పరిపుష్టి లేకపోయినా విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెడుతుండటం, ద్విచక్ర వాహనాలు మారుస్తూ తిరుగుతుండటం గుర్తించారు. వారిపై నిఘా పెట్టి రాత్రి సమయంలో తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వారి నేరాల చిట్టా బయట పెట్టారు.

తెల్లవారు జామున 3 గంటల లోపు చోరీలు

సోమాలమ్మ గుడి వీధికి చెందిన ఒకరు, రెడ్డీలపేట రామాలయం సెంటర్‌కు చెందిన ఇద్దరు మైనర్లు కలిపి చోరీ చేసిన 20 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ఎక్కువ హోండా, సుజీకి మోపెడ్ వాహనాలు ఉండటం గమనార్హం. రాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారు జాము 3 గంటల లోపు వాహనాల చోరీకి అనువుగా ఎంచుకునేవారు. దొంగిలించిన వాహనాలను రూ.5 వేల నుంచి 10 వేలకే వారికి పరిచయం ఉన్న నగరంలోని తుమ్మలావకు చెందిన మోటారు సైకిల్ మెకానిక్ శేఖర్, ఇన్నీసుపేటకు చెందిన గోపాలకృష్ణకు అమ్మేవారు. వారు వాటిని మరికొంత సొమ్ము వేసి ఇతరులకు అమ్మేసేవారు. మెకానిక్ ద్వారా విక్రయించగా వచ్చిన సొమ్ముతో జల్సా చేసుకునేవారు. నేరస్తులను న్యాయస్థానంలో హాజరు పర్చడంలోను, వారిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన మూడో పట్టణ సీఐ వీరయ్యగౌడ్, ఎస్సై శివనాగబాబు, హెడ్ కానిస్టేబుల్ పి.వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు బి.విజయ్ కుమార్, టీవీసత్యనారాయణలను అభినందించి, ఏఎస్పీ వారికి రివార్డులు అందజేశారు.

అన్నవరం ఆలయ బడ్జెట్ ఆమోదం

రూ.176.90 కోట్లకు తగ్గిస్తూ కమిషనర్ నిర్ణయం



అన్నవరం దేవస్థానం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.176.90 కోట్ల వార్షిక బడ్జెట్‌కు దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు కమిషనర్ ఎస్.సత్యనారాయణ గురువారం ఆదేశాలు జారీ చేశారు. బడ్జెట్‌లో ఆదాయం అంచనా రూ.177.25 కోట్లు, వ్యయం రూ.177.14గా, రూ.11 లక్షలు మిగులుగా పేర్కొంటూ గత నెల 14 వ తేదీన దేవస్థానం ధర్మకర్తల మండలి తీర్మానం చేసింది. అయితే అంచనా వ్యయాన్ని కొద్దిగా తగ్గించి రూ.176.90 కోట్లకు ఆమోదం తెలిపారు.

ముఖ్యాంశాలు

బడ్జెట్‌లో వ్రతాల విభాగం ద్వారా రూ.42 కోట్లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.24.74 కోట్లు, హుండీల ద్వారా రూ.22 కోట్లు, షాపుల లీజుల ద్వారా రూ.19.16 కోట్లు, వసతి సత్రాల గదుల అద్దెల ద్వారా రూ.పది కోట్లు, ఇతర విభాగాల ద్వారా సుమారు రూ.60 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఎస్టాబ్లిస్‌మెంట్ చార్జెస్ కింద రూ.41.30 కోట్లు, వివిధ ముడి సరుకుల కొనుగోళ్లకు రూ.34.52 కోట్లు, ఇంజినీరింగ్ విభాగం కింద వివిధ నిర్మాణాలు, మెయిన్‌టెన్స్ కింద రూ.పది కోట్లు, విద్యుత్ విభాగానికి రూ.4.5 కోట్లు, వ్రత పురోహితుల, ప్రసాదం ప్యాకర్స్, నాయీ బ్రాహ్మణుల పారితోషికం కింద రూ.21.05 కోట్లు, సీజీఎఫ్ చెల్లింపుల కింద రూ.19.50 కోట్లు, సెక్యూరిటీ కింద రూ.4.75 కోట్లు, విద్యాసంస్థలు, ఆగమ పాఠశాల, దత్తత ఆలయాల నిర్వహణకు రూ.5.25 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఇంకా మిగిలిన వాటికి సుమారు రూ.40 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు.

వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన లక్ష్మణరావు

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని పల్లిపాలేనికి చెందిన మల్లాడి లక్ష్మణరావు (50) బుధవారం ఉదయం తన ఇంటి ఆవరణలో ఉన్న చెట్టుకి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోడసుకుర్రులోని మాధవి ఫర్నిచర్ షాపులో కొంత కాలంగా కార్పెంటర్‌గా లక్ష్మణరావు పని చేస్తున్నాడు. షాపు యజమాని అమలాపురంలోని ఓ షాపుతో లావాదేవీలు నడుపుతున్నారు. అయితే లక్ష్మణరావు షాపు యజమానికి తెలియకుండా తనకు కావలసిన సరకులను షాపు ఖాతాలో తెచ్చుకుని బయట వారికి అమ్ముకోవడం ప్రారంభించారు. షాపు బాకీ పెరిగిపోవడంతో మాధవి ఫర్నిచర్ షాపు యజమానికి అనుమానం వచ్చి అమలాపురం టౌన్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో మనస్థాపానికి గురైన లక్ష్మణరావు చెట్టుకి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై అల్లవరం ఎస్సై హరీష్‌కుమార్ కేసు నమోదు చేశారు. మృతుడుకి భార్య,కుమార్తె ఉన్నారు.

తిరుపతి-పూరీ ఎక్స్‌ప్రెస్ రైలుపై విస్తృత ప్రచారం

- 13 నుంచి ఉదయం 9.02 గంటలకు కొవ్వూరులో హాల్టు
- రైల్వే స్టేషన్ పునరుద్ధరణ సమితి పట్టణంలో ప్రచారం



కొవ్వూరులో డిప్యూటీ తహసిల్దార్‌కి కరపత్రం అందజేస్తున్న రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి సభ్యులు

కొవ్వూరు: తిరుపతి–పూరీ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 13వ తేదీ నుంచి కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో హాల్టు ఇచ్చిన నేపథ్యంలో ప్రయాణికులు సద్వినియోగ పరుచుకోవాలని రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి సభ్యులు కోరుతున్నారు. కోవిడ్ నేపథ్యంలో కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌లను నిలిపివేశారు. కొవ్వూరు నుంచి టికెటింగ్ సరిగా లేకపోతే మళ్లీ హాల్టుని తొలగించే అవకాశం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. దీంతో స్టేషన్ పరిరక్షణ సమితి సభ్యులు పట్టణంలో ప్రధాన కార్యాలయాలు, దుకాణాలకు వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఉదయం 9.02 గంటలకు స్టేషన్‌కి వస్తుందన్నారు. వారంలో నాలుగు రోజులు పూరి నుంచి తిరుపతి వెళుతుందని, గురు, శనివారం రెండు రోజులు బిలాస్‌పూర్ నుంచి తిరుపతి వెళుతుందని రైల్వే వర్గాలు తెలిపాయి. రాత్రి పూట 10.05 గంటలకు తిరిగి తిరుపతి నుంచి కొవ్వూరు రైల్వే స్టేషన్‌కి వస్తుందన్నారు. ఈ రైలుని ప్రయోగాత్మకంగా హాల్టు ఇచ్చారని తెలిపారు. ఈ రైలు నిడదవోలు, తణుకు, భీమవరం, కైకలూరు, గుడివాడ మీదుగా తిరుపతి వెళుతుందన్నారు. కొవ్వూరు రైల్వే స్టేషన్ పరిరక్షణ ఉద్యమం ఫలితంగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఎట్టకేలకు స్పందించి ఈ ఎక్స్‌ప్రెస్ సర్వీసును వేశారని, దీన్ని సద్వినియోగ పరుచుకోనట్లయితే మళ్లీ తొలగించే ప్రమాదం ఉందని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా, వాట్సాప్స్ గ్రూపుల ద్వారా రైలు టిక్కెట్లు, కోనుగోలు చేసిన ప్రయాణికుల ఫొటోలను ప్రచారం చేస్తున్నారు.

ఆకట్టుకున్న మాధవవర్మ పద్య నాటకం



మాధవ వర్మ నాటకంలోని ఒక సన్నివేశం

బోట్‌క్లబ్: సరస్వతి గాన సభ 120వ వార్షిక సంగీత నృత్య నాటకోత్సవాల్లో భాగంగా గురువారం సూర్య కళామందిరంలో విజయవాడ సాయిబాబా నాట్య మండలి ప్రదర్శించిన మాధవ వర్మ నాటకం నగర ప్రజలను అలరించింది. రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు పొందిన ఈ పద్య నాటకం ప్రేక్షకులను ఆద్యంతం ఆకట్టుకుంది. ఐదో శతాబ్దంలో బెజవాడ రాజధానిగా విష్ణుకుండిన సామ్రాజ్యాన్ని పరిపాలించిన రెండవ మాధవ వర్మ చరిత్ర ఆధారంగా ఈ నాటకం సాగింది. మాధవ వర్మ కుమారుడైన విక్రమేంద్రవర్మ తోలుతున్న గుర్రం కాళ్లకింద కట్టెలు కొట్టి పొట్టపోసుకునే గుండమ్మ కుమారుడు మరణిస్తాడు. ఆమె రాజు కట్టించిన ధర్మగంట మోగించి న్యాయం కోరుతుంది. రాజు మాధవ వర్మ పూర్వాపరాలు విచారించి కొడుకును దోషిగా నిర్ధారించి, అతనికి మరణ శిక్ష విధిస్తాడు. అతని ధర్మనిరతికి సమన్యాయ పాలనకు మెచ్చి కనకదుర్గమ్మ ప్రత్యక్షమై వరం కోరకోమనగా తన కుమారుని కారణంగా చనిపోయిన గుండమ్మ కుమారుడిని బతికించమని కోరతాడు. అతని ఔదార్యానికి మెచ్చిన అమ్మవారు అతని కుమారుడు విక్రమేంద్రుని వర్మను కూడా బతికించి మాధవ వర్మకు కానుకగా ఇస్తుంది. అతని రాజ్యంలో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఒక ఘడియపాటు బెజవాడలో కనకవర్షం కురిపించి బెజవాడ కనకదుర్గగా ప్రఖ్యాతిగాంచి, భక్తుల అభీష్టాలను నెరవేరుస్తుంది. ఈ కథ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

రౌతులపూడి: మండలంలోని రాజవరంలో బాల్యవివాహాన్ని గురువారం అధికారులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఎ.మల్లవరం గ్రామానికి చెందిన బర్ల గంగరాజు, వెంకటలక్ష్మి దంపతుల నిర్వహించతలపెట్టిన కుమార్తె బాల్య వివాహంపై ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి అధికారులతో కలసి తల్లితండ్రులకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. వివాహ వయసు రాకుండా వివాహాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. చిన్నపిల్లలకు వివాహం చేయటం వలన వివాహ అనంతరం ఆరోగ్యరీత్యా, శారీరకంగా అనేక ఇబ్బందులకు గురవుతారన్నారు. అమ్మాయిలకు పద్దెనిమిదేళ్లు నిండకుండా వివాహం చేయడం సమంజసం కాదన్నారు. రౌతులపూడి హెడ్ కానిస్టేబుల్ రాజు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, వీఆర్‌ఓ సరస్వతి, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యువర్స్

● గేమింగ్

వేయి కన్నుల శత్రువు వేట



హరైజన్ జీరో డాన్ (2017) గేమ్‌కు సీక్వెల్‌గా వచ్చిన యాక్షన్-రోల్ ప్లేయింగ్ గేమ్ హరైజన్ ఫర్‌బిడెన్ వెస్ట్(పీసీ) విడుదలైంది. థర్డ్-పర్సన్ పర్‌స్పెక్టివ్‌లో ఆడే గేమ్ ఇది. ప్రమాదకరమైన ఆయుధాలతో నిండిన 'అలోయ్' అనే హంటర్‌ను ప్లేయర్ కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. నోరా తెగకు చెందిన యంగ్ హంటర్ అలోయ్ శాస్త్రవేత్త ఎలిజబెత్ సోబెక్ క్లోన్. 'మిస్టీరియస్ ప్లేగ్' మూలాన్ని తెలుసుకోవడానికి తన బృందాన్ని ఫర్‌బిడెన్ వెస్ట్ అని పిలవబడే సరిహద్దు ప్రాంతానికి తీసుకువెళుతుంది. ఆలోయ్ తన ప్రయాణంలో భారీ తుఫానులను, సంచార తెగలతో యుద్ధాలను ఎదుర్కొంటుంది. పచ్చనిలోయల నుంచి శిథిలమైన నగరాల వరకు ఆలోయ్ ప్రయాణంలో ఎన్నో దృశ్యాలు కనిపిస్తాయి. గత గేమ్‌తో పోల్చితే ఈ గేమ్ మ్యాప్ పెద్దగా ఉంటుంది. షీల్డ్ వింగ్, ఫోకస్ స్కానర్, డైవింగ్ మాస్క్, పుల్‌కాస్టర్‌లాంటి టూల్స్‌ను కంబాట్‌లో ఉపయోగించవచ్చు.

● ప్లాట్‌ఫామ్స్: ప్లే స్టేషన్ 4, ప్లే స్టేషన్ 5,
● విండోస్ జానర్: యాక్షన్, అడ్వెంచర్ ● మోడ్: సింగిల్-ప్లేయర్

● అదర్‌సైడ్

సామాజిక సేవ నుంచి సైన్స్ వరకు

బెంగళూరుకు చెందిన సియా గోడికా పేరు వినిపించగానే 'సోల్ వారియర్స్' గుర్తుకు వస్తుంది. 'సోల్ వారియర్స్' స్వచ్ఛంద సంస్థ ద్వారా పేదలకు పాదరక్షలను అందిస్తుంది సియా. 'చేంజ్‌మేకర్'గా గుర్తింపు పొందిన సియా గోడికా చదువులోనూ ప్రతిభ చూపుతోంది. 'ప్లూరిపోటెంట్ స్టెమ్ సెల్స్' గురించి ఆమె చేసిన సైన్స్ వీడియో 'బ్రేక్‌త్రూ జూనియర్ చాలెంజ్'లో బహుమతి గెలుచుకుంది. సైన్స్, మ్యాథమెటిక్స్‌కు సంబంధించి క్రియేటివ్ థింకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌కు ఇచ్చే ప్రైజ్ ఇది.



● సియా గోడికా



సేవామార్గంలో ప్రయాణించడంతో పాటు క్రియేటివ్ థింకింగ్ కోసం పుస్తకాలు ఎక్కువగా చదువుతుంటుంది సియా. సైన్స్‌కు సంబంధించిన సరికొత్త విషయాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తుంటుంది.


'ఇంట్లో పిల్లలకు ప్రోత్సాహకరమైన వాతావరణం ఉంటే గొప్ప విజయాలు సాధించవచ్చు' అని చెప్పడానికి సియా ఒక ఉదాహరణ.

సేవాకార్యక్రమాలకు తమ వంతుగా సహాయపడడం నుంచి సైన్స్ సంగతులు చెప్పడం వరకు సియా గోడికాకు ఎన్నో రకాలుగా ఆమె తల్లిదండ్రులు సహకారం అందించారు.

● స్పేస్ టెక్ స్టార్టప్

అంతరిక్షంలో అగ్ని సంతకం





● శ్రీనాథ్ రవిచంద్రన్ ● మోహిన్

ఏరో స్పేస్ టెక్నాలజీ అనగానే విదేశాల వైపు చూసే ఎంతో మందికి మన సత్తా చూపించిన స్టార్టప్‌లలో 'అగ్నికుల్ కాస్మోస్' ఒకటి. ఆకాశమంత కలతో బయలుదేరిన 'అగ్నికుల్' అమ్ముల పొదిలో దివ్యాస్త్రం అగ్నిబాణ్....

'అగ్నికుల్' అంటే భారత అంతరిక్ష రంగంలో ఆత్మనిర్భర్ విజయగాథ.

ఐఐటీ–మద్రాస్ కేంద్రంగా పని చేస్తున్న 'అగ్నికుల్ కాస్మోస్' త్రీడీ ప్రింటెడ్ రాకెట్ ఇంజిన్‌ను తయారు చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ప్రశంసలు అందుకుంది. స్నేహితుడు మోహిన్, ప్రొఫెసర్ చక్రవర్తిలతో కలిసి 2017లో 'అగ్నికుల్'ను లాంచ్ చేశాడు శ్రీనాథ్ రవిచంద్రన్. మన దేశంలోని ఫస్ట్ ప్రైవేట్ స్మాల్ శాటిలైట్ రాకెట్ 'అగ్నిబాణ్'ను నిర్మించింది అగ్నికుల్. 30 కిలోల నుండి 300 కిలోల బరువు ఉన్న పేలోడ్‌ను తక్కువ భూకక్ష్యలోకి (సుమారు ఏడువందల కిలోమీటర్ల ఎత్తు) తీసుకువెళ్లే సామర్థ్యం దీని సొంతం. 2020లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)తో ఒప్పందం కుదుర్చుకున్న తొలి భారతీయ కంపెనీగా ప్రత్యేకత సాధించింది అగ్నికుల్. ఒప్పందం ద్వారా 'అగ్నిబాణ్' నిర్మాణంలో 'ఇస్రో' సహాయ, సహకారాలను తీసుకుంది.

ప్లగ్-అండ్-ప్లే ఇంజిన్ కాన్ఫిగరేషన్ సామర్థ్యం ఉన్న అగ్నిబాణ్, మిషన్ అవసరాలకు ఖచ్చితంగా సరిపోయేలా కాన్ఫిగర్ చేయగలదు. ప్రతి క్లయింట్‌కు సంబంధించిన ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా కాన్ఫిగర్ చేయవచ్చు. 3డీ సాంకేతికతతో రూపొందించిన ఈ రాకెట్ ఉపగ్రహ ప్రయోగాల ఖర్చును తగ్గిస్తుంది.

మొదట్లో వారానికి కనీసం రెండు రాకెట్ ఇంజిన్‌లను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకొని ఆ తరువాత నాలుగు ఇంజిన్‌లకు విస్తరించింది అగ్నికుల్. ఒక్కో అడుగు వేస్తూ ముందుకు వెళ్లింది.

'మోర్ యాక్సెసబుల్ అండ్ అఫర్డబుల్' లక్ష్యంతో బయలు దేరిన శ్రీనాథ్ రవిచంద్రన్, మోయిన్‌లు మరిన్ని లక్ష్యాలు నిర్దేశించుకోవడానికి రెడీ అవుతున్నారు.



● శ్రీనాథ్ రవిచంద్రన్ 'అగ్నికుల్' కో-ఫౌండర్, సీఈవో

ఆత్మవిశ్వాసమే అద్భుత శక్తి

2017లో 'అగ్నికుల్'తో శ్రీనాథ్ రవిచంద్రన్, మోయిన్‌లు ప్రయాణం మొదలు పెట్టినప్పుడు ఇన్వెస్టర్‌ల నుంచి విశ్లేషకుల వరకు 'మన దేశంలో ఇది సాధ్యమా? ఈ కుర్రాళ్ల వల్ల అవుతుందా' అనే అనుమాన నీడ ఉండేది. అయితే శ్రీనాథ్, మోహిన్‌లు ఎప్పుడూ ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. ఆత్మవిశ్వాసం అనే అద్భుతశక్తితో ముందుకు కదిలారు. నాలుగు వందల వరకు పిచ్ మీటింగ్‌లు నిర్వహించిన తరువాతే ఫస్ట్ రౌండ్ ఫండింగ్ 2018లో వచ్చింది. అనుమాన నీడ వెనక్కి వెళ్లి 'అగ్నికుల్' పేరు ప్రపంచానికి పరిచయం కావడానికి ఎంతోకాలం పట్టలేదు. మన దేశంలో స్పేస్ టెక్ స్టార్టప్‌ల విజయాన్ని దృష్టిలో పెట్టుకొని 'ఏరోస్పేస్ డిగ్రీలు చేయడానికి చాలామంది విదేశాలకు వెళ్లాలనుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇక్కడే ఉండాలనుకుంటున్నారు' అంటున్నాడు 'అగ్నికుల్' కో-ఫౌండర్, సీఈవో శ్రీనాథ్ రవిచంద్రన్.

● శ్రీహరి కోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని ప్రైవేట్ లాంచ్ ప్యాడ్ నుంచి ఈరోజు లాంచ్ చేయాల్సిన 'అగ్నిబాణ్' సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది.

English Idioms

కీప్ కార్డ్స్ క్లోజ్ టు చెస్ట్

ప్లాన్, ఇంటెన్షన్, ఇన్‌ఫర్‌మేషన్‌లను రహస్యంగా ఉంచే సందర్భంలో వాడే మాట... కీప్ కార్డ్స్ క్లోజ్ టు చెస్ట్.

ఉదా: ది చిల్డ్రన్ డిడ్ నాట్ నో వేర్ దే వర్ టు గో ఫర్ దెయిర్ ఫ్యామిలీ హాలిడే ట్రిప్. దెయిర్ డ్యాడ్ కెప్ట్ హిజ్ కార్డ్స్ క్లోజ్ టు హిజ్ చెస్ట్.

పుష్ ది బోట్ ఔట్

సెలబ్రేషన్ లేదా ఏదైనా కార్యక్రమం కోసం డబ్బును కుమ్మరించే సందర్భంలో వాడే మాట... పుష్ ది బోట్ ఔట్

ఉదా: లెట్ అజ్ పుష్ ది బోట్ ఔట్ అండ్ సెలబ్రేట్ ది విన్ విత్ ఏ ఫ్యాన్సీ డిన్నర్ నైట్

● టెక్... టాక్

ఆసూస్ జెన్‌ఫోన్ 11 ఆల్ట్రా



డిస్‌ప్లే	:	6.78 అంగుళాలు
రిజల్యూషన్	:	1080X2400 పిక్సెల్స్
మెమోరీ	:	256జీబి 12జీబి ర్యామ్/ 512 జీబి 16జీబి ర్యామ్
ఓఎస్	:	ఆండ్రాయిడ్ 14
ఫ్రంట్ కెమెరా	:	32 ఎంపీ
బ్యాటరీ	:	5500 ఎంఏహెచ్
బరువు	:	224 గ్రా.

హానర్ వాచ్ జీఎస్ 4



● హార్ట్ రేట్ మానిటరింగ్, స్లీప్ ట్రాకింగ్, స్ట్రెస్ అండ్ బ్లడ్ ఆక్సిజన్ లెవెల్ మెజరింగ్‌లాంటి హెల్త్ అండ్ ఫిట్‌నెస్ ఫీచర్‌లు ఉన్నాయి ● 100 ప్లస్ ఇండోర్ అండ్ ఔట్‌డోర్ మోడ్స్, కస్టమ్ స్పోర్ట్స్ మోడ్స్, 10 ప్లస్ ప్రొఫెషనల్ స్పోర్ట్స్ మోడ్స్‌ను సపోర్ట్ చేస్తుంది. ● రిజల్యూషన్: 466X466 పిక్సెల్స్ ● స్టోరేజ్: 4జీబి ● 5 ఏటీయం వాటర్ రెసిస్టెంట్ ● 32 ఎంబీ ర్యామ్

బింగ్ ఏఐ హోలీ చిత్రాలు

ఆకట్టుకునే ఇమేజ్‌లతో ఫ్రెండ్స్‌కు హోలి శుభాకాంక్షలు తెలియజేయాలనుకుంటున్నారా? అయితే ఇది మీ కోసమే... మైక్రోసాఫ్ట్ వారి 'బింగ్ ఏఐ ఇమేజ్ క్రియేటర్'ను ఉపయోగించి 3డీ హోలీ థీమ్ ఇమేజ్‌లను క్రియేట్ చేయవచ్చు. సింపుల్ ప్రాంప్ట్స్ ద్వారా 'బింగ్ ఏఐ ఇమేజ్ క్రియేటర్'పై హోలి ఇమేజ్‌లు క్రియేట్ చేయవచ్చు. వీటిని ఆండ్రాయిడ్ అండ్ ఐవోఎస్, డెస్క్‌టాప్‌లతో యాక్సెస్ చేయవచ్చు. జెనరేట్ అయిన ఇమేజ్‌లు మీకు అంతగా నచ్చకపోతే 'మేక్ దెమ్ మోర్ కలర్‌ఫుల్ అండ్ వైబ్రంట్' 'మేక్ దెమ్ డీటెయిల్డ్' 'మేక్ దెమ్ లుక్ ఫోటో-రియలిస్టిక్' లాంటి ప్రాంప్ట్స్ ఇవ్వవచ్చు.



ఇమోజీ రియక్షన్ ఫీచర్

కమ్యూనికేషన్‌ను మరింత సులభతరం చేయడానికి 'గూగుల్ మెసేజెస్' చాట్స్‌లో ఇమోజీ రియాక్షన్ ఫీచర్ తీసుకు వచ్చింది. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఐమెసేజ్‌లలో మాదిరిగానే ఈ ఫీచర్‌ని ఉపయోగించవచ్చు. రియాక్షన్ ఇమోజీ జోడించడానికి పర్టిక్యులర్ ఎస్ఎంఎస్‌ను లాంగ్ ప్రెస్ చేస్తే ఇమోజీ మెనూ కనిపిస్తుంది. దీని నుంచి మనకు కావలసిన ఇమోజీని సెలెక్ట్ చేసుకోవచ్చు. థమ్స్ అప్, రెడ్ హార్ట్, లాఫింగ్ ఇమోజీ, థమ్స్ డౌన్, క్రైయింగ్ ఫేస్‌లాంటి పది ఇమోజీ క్యారెక్టర్లు ఇందులో ఉంటాయి.



సినిమా

తగ్గేదే లే!



● అల్లు అర్జున్

హీరో అల్లు అర్జున్ మరో ఘనత సాధించారు. సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రామ్‌లో అల్లు అర్జున్‌ని ఫాలో అయ్యేవారి సంఖ్య (ఫాలోవర్స్) 25 మిలియన్స్‌కు చేరుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇంతమంది ఫాలోవర్స్ ఉన్న తొలి దక్షిణాది నటుడిగా అల్లు అర్జున్ రికార్డ్ సృష్టించి, తగ్గేదే లే అంటున్నారు. 'పుష్ప: ది రైజ్' సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో అభిమానులను సొంతం చేసుకున్నారు అల్లు అర్జున్. అదే విధంగా ఆ మూవీకి ఉత్తమ నటుడి కేటగిరీలో తెలుగులో జాతీయ అవార్డు సాధించిన తొలి హీరోగా అరుదైన ఘనత సాధించారాయన. కాగా సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ ఎప్పటికప్పుడు సినిమా, వ్యక్తిగత విషయాలను అభిమానులతో పంచుకుంటారు అల్లు అర్జున్. అందులో భాగంగానే దక్షిణాదిలో అత్యధిక ఇన్‌స్టా ఫాలోవర్స్ ఉన్న హీరోగా రికార్డ్‌ను క్రియేట్ చేశారు. ఆ తర్వాతి స్థానంలో హీరో విజయ్ దేవరకొండ (21.3 మిలియన్లు), మూడో స్థానంలో హీరో రామ్ చరణ్ (20.8మిలియన్లు) ఉన్నారు.

భాగ్యనగరంలో పూర్తి



● కీరవాణి, త్రిష, చిరంజీవి

చిరంజీవి హీరోగా నటిస్తున్న 'విశ్వంభర' చిత్రం హైదరాబాద్ షెడ్యూల్ పూర్తి చేసుకుంది. 'బింబిసార' చిత్రంతో బ్లాక్‌బస్టర్ అందుకున్న వశిష్ఠ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. 'స్టాలిన్' (2006) వంటి హిట్ మూవీలో జోడీగా నటించిన చిరంజీవి–త్రిష 'విశ్వంభర' మూవీ కోసం రెండోసారి కలిశారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ చిత్రం నిర్మిస్తున్నారు. కాగా ఇటీవల హైదరాబాద్‌లో మొదలైన 'విశ్వంభర' షెడ్యూల్ పూర్తయినట్లు మేకర్స్ ప్రకటించారు. చిరంజీవి, త్రిషతో పాటు ప్రధాన తారాగణం పాల్గొన్న ఈ షెడ్యూల్‌లో కొంత టాకీ పార్ట్, ఓ పాట, యాక్షన్ బ్లాక్‌ని చిత్రీకరించినట్లు యూనిట్ పేర్కొంది. ''ఫ్యాంటసీ అడ్వెంచర్‌గా రూపొందుతున్న చిత్రం 'విశ్వంభర'. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ మూవీ ఉంటుంది. 2025 సంక్రాంతి కానుకగా జనవరి 10న ఈ సినిమాని విడుదల చేస్తాం'' అని చిత్రబృందం తెలిపింది. ఇదిలా ఉంటే.. చిరంజీవి నివాసంలో చిత్ర సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణితో సహా యూనిట్‌తో దిగిన ఫొటోలను త్రిష సోషల్ మీడియాలో షేర్ చేసి, 'ఇదొక లెజెండరీ, అద్భుతమైన రోజు! విశ్వంభర' అని పోస్ట్ చేశారు. ఈ చిత్రానికి కెమెరా: ఛోటా కె. నాయుడు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కార్తీక్ శబరీష్, లైన్ ప్రొడ్యూసర్: రామిరెడ్డి శ్రీధర్ రెడ్డి.

కాంబినేషన్ రిపీట్



● రామ్‌చరణ్

'రంగస్థలం' కాంబినేషన్ రిపీట్ కానుందని టాక్. హీరో రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన బ్లాక్ బస్టర్ ఫిల్మ్ 'రంగస్థలం' (2018). కాగా రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో మరో సినిమాకు సన్నాహాలు మొదలయ్యాయట. ఈ నెల 27న రామ్‌చరణ్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన వెల్లడి కానుందని తెలిసింది. 'రంగస్థలం' సినిమాను నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందని, దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తారని భోగట్టా.

చరణ్ సినిమాలో సంజయ్ దత్?

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్న ఈ సినిమాలో కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ ఓ కీలక పాత్ర చేయనున్నారు. అలాగే బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో కనిపిస్తారనే టాక్ తెరపైకి వచ్చింది. ఇక హిందీలో రామ్ చరణ్ చేసిన తొలి చిత్రం 'తుఫాన్'లో సంజయ్ దత్ ఓ రోల్ చేశారు. మరి.. రామ్‌చరణ్, సంజయ్ దత్ మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకుంటారా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

గోదావరి నేపథ్యంలో...

'పలాస 1978' ఫేం రక్షిత్ అట్లూరి హీరోగా, కోమలీ ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'శశివదనే'. సాయి మోహన్ ఉబ్బర దర్శకుడు. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి మాట్లాడుతూ– ''మా సినిమాని ఏప్రిల్ 5న రిలీజ్ చేద్దామనుకున్నాం. కానీ డిస్ట్రిబ్యూటర్స్ అడిగిన మేరకు 19న రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ''గోదావరి నేపథ్యంలో లవ్ అండ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన చిత్రం 'శశివదనే'' అన్నారు సాయి మోహన్ ఉబ్బర. ''నా 'పలాస 1978' కంటే 'శశివదనే' పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు రక్షిత్ అట్లూరి. కోమలీ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీపాల్, సినిమాటోగ్రాఫర్ శ్రీసాయి కుమార్ దారా మాట్లాడారు.



● కోమలీ ప్రసాద్, రక్షిత్ అట్లూరి

అయోమయం.. ఆశ్చర్యం



● 'దో ఔర్ దో ప్యార్' మూవీ పోస్టర్

విద్యాబాలన్, ప్రతీక్ గాంధీ, ఇలియానా, సెంథిల్ రామమూర్తి లీడ్ రోల్స్‌లో నటించిన బాలీవుడ్ రొమాంటిక్ కామెడీ ఫిల్మ్ 'దో ఔర్ దో ప్యార్'. శీర్ష గుహ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఏప్రిల్ 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. 'నేను వీగన్... పాలతో తయారైన వాటిని తినను (విద్యాబాలన్)', 'మరి.. మీ ఫేస్ వాష్‌లలో మిల్క్ ఉంటుంది కదా (ప్రతీక్ గాంధీ)!', 'మనం డేటింగ్‌లో ఉన్న వారిలా లేము.. నిజంగా భార్యాభర్తలు ఎలా ఉంటారో అలానే ఉంటున్నాం (ఇలియానా)' వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. 'ప్రేమ కన్‌ఫ్యూజ్ చేస్తుంది. సర్‌ప్రైజ్ చేస్తుంది' అన్నవి కూడా టీజర్‌లో కనిపించాయి.

గుండెల్లోన.. ప్రేమవాన!

నార్నే నితిన్, నయన్ సారిక హీరోహీరోయిన్లుగా అంజి కంచిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆయ్'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'సూఫియానా.. గుండెల్లోన ప్రేమవాన..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. రామ్‌మిరియాల సంగీత సారథ్యంలో శ్రీమణి ఈ పాటకు లిరిక్స్ అందించారు. రామ్ మిరియాల, సమీర భరద్వాజ్, రమ్యశ్రీ పాడారు.



● నయన్ సారిక, నార్నే నితిన్

మళ్లీ స్పైడర్‌మేన్ వస్తున్నాడు



● స్పైడర్‌మేన్ నో వే హోమ్ పోస్టర్

హాలీవుడ్ సూపర్ హిట్ సూపర్ హీరో 'స్పైడర్ మేన్' మళ్లీ థియేటర్స్‌కు వస్తున్నాడు. స్పైడర్ మేన్ ఫ్రాంచైజీలో ఇప్పటి వరకూ ఎనిమిది సినిమాలు వచ్చాయి. 'స్పైడర్‌మేన్' (2002), 'స్పైడర్‌మేన్ 2' (2004), 'స్పైడర్‌మేన్ 3' (2007), 'ది అమేజింగ్ స్పైడర్‌మేన్' (2007), 'ది అమేజింగ్ స్పైడర్‌మేన్ 2' (2014), 'స్పైడర్‌మేన్: హోమ్ కమింగ్' (2017), 'స్పైడర్‌మేన్: ఫార్ ఫ్రమ్ హోమ్' (2019), 'స్పైడర్‌మేన్: నో వే హోమ్' (2021)... ఈ 8 చిత్రాలూ రీ రిలీజ్ కానున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ కొలంబియా పిక్చర్స్ వంద సంవత్సరాలను పూర్తి చేసుకున్న సందర్భంగా 'స్పైడర్‌మేన్' ఫ్రాంచైజీ సినిమాలను రీ రిలీజ్ చేస్తోందని హాలీవుడ్ సమాచారం. ఈ 8 సినిమాలకు సంబంధించి ఓ కామన్ ట్రైలర్‌ను కూడా రిలీజ్ చేశారు. ఈ చిత్రాలు కూడా ఏప్రిల్ 15 నుంచి వారానికి ఒక్కొక్కటి చొప్పున జూన్ 3 వరకు విడుదలవుతాయి. ప్రతి చిత్రం కూడా సోమవారమే రీ –రిలీజ్ కానుండటం విశేషం. ఎంపిక చేసిన థియేటర్స్‌లోనే ఈ సినిమాలు రీ రిలీజ్ కానున్నాయి.

ఆ ఒత్తిడి ఎదుర్కొన్నా!

- దర్శకుడు మల్లిక్ రామ్



''డీజే టిల్లు'(2022) సినిమాకి సీక్వెల్‌గా వస్తున్న 'టిల్లు స్క్వేర్'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఎలాగైనా హిట్ కొట్టాలి, వారి అంచనాలు అందుకోవాలనే ఒత్తిడితో 'టిల్లు స్క్వేర్' తీశాను. ఫైనల్ ఔట్‌పుట్ చూశాక సినిమా బాగా వచ్చింది.. ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుందనే నమ్మకంతో రిలీఫ్ అయ్యాను'' అని దర్శకుడు మల్లిక్ రామ్ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ– ''నేను, సిద్ధు, ప్రశాంత్ వర్మ, తేజ సజ్జా... మేమంతా ఈ స్థాయికి రావడం కోసం 12 ఏళ్లుగా కష్టపడుతున్నాం. ఇప్పుడు కలిసి సినిమాలు చేస్తున్నాం. సిద్ధు బాగా నటించాడు. లిల్లీ పాత్రకి అనుపమ నూటికి నూరు శాతం న్యాయం చేసింది. నిర్మాతలు రాధాకృష్ణ, నాగవంశీ, సాయి సౌజన్యగార్లు బడ్జెట్ గురించి ఎప్పుడూ మాట్లాడలేదు. కంటెంట్ గురించి, క్వాలిటీ గురించే ఎక్కువ మాట్లాడారు. ఏ విషయంలో రాజీ పడలేదు.. అందుకే కొన్ని సన్నివేశాలు రీ షూట్ చేశాం. ఒక్కమాటలో చెప్పాలంటే 'డీజే టిల్లు' నచ్చినవారిని 'టిల్లు స్క్వేర్' ఏమాత్రం నిరాశపరచదు. ఇక 'టిల్లు 3'కి అవకాశం ఉందా అంటే.. కొన్ని ఆలోచనలు ఉన్నాయి. భవిష్యత్తులో మూడో భాగం ఉండొచ్చు''అన్నారు.